౪. కథలు

౧

'అమ్మా! అమ్మా! నాకుయెప్పుడూ జ్వరంగానే ఉంటే బాగుంటుందే' అన్నాడు మధు, తల్లివంక చూచి దీనంగా.

'అదేమిటి పిచ్చినాన్నా అట్లా అంటావు! జ్వరం యేమి బాగుంటుంది బాబూ!'

'జ్వరం బాగుండదు గాని జ్వరం వస్తేనేగాని నీవు నా దగ్గిర చాలసేపు ఉండవుగా'

'అయ్యో! నాపిచ్చితండ్రీ! నేను దగ్గిర ఉండేందుకు పాడు జ్వరం యెప్పుడూ ఉండాలని కోరుకుంటున్నావా? నేను దగ్గిర ఉండి నీకేమి వరిగిస్తాను. నా పని అయితే నీకు జ్వరం లేకపోతే మాత్రం నీవద్ద ఉండక యెక్కడికి పోతాను? నీకు యీవారం రోజులనుంచీ జ్వరంగా ఉండుటచేత నేనెంత దిగులుపడుతున్నానో చూస్తూ. నీవు జ్వరం లేకుండా ఉండి చక్కగా బడికి పోయి చదువుకుంటూ కులాసాగా ఆడుకుంటూఉంటే నాకెంత హాయిగా ఉంటుంది. నీకోసమే గాదూ. నే నింత శ్రమపడుట. నీవు ఆరోగ్యంగా ఉండకపోతే నే నెందు కీభూమిమీద బ్రతికి.'

కనుపర్తి వరలక్ష్మమ్మ

"'అమ్మా! అమ్మా! నాకుయెప్పుడూ జ్వరంగానే ఉంటే బాగుంటుందే' అన్నాడు......",

'ఏమమ్మా ఇక అక్కడనే సరా. ఎప్పుడూ కొడుకును అంటి పెట్టుకొని కూర్చోడానికి అబ్బాయి జబ్బు నెపం దొరికినట్టుంది. ఇదేమి మాయజ్వరమో యెన్నాళ్లకూ నయంగాకుండా ఉన్నది. ఆపిల్లవాడి కెంత మొండితనమో, రోగానికీ అంతే మొండితనం ఉన్నట్టున్నది.'

'అదిగో నాయనా! మీ అత్తయ్యకేకలు వింటున్నావా? బోలెడు చాకిరి ఉన్నది.

'పో! అమ్మా! పో! తొందరగా పో' అని గడగడలాడి భయంతో పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు మధు.

వదినెగారిమాటలు వినంగానే కమలమ్మ పిల్లవాడి మంచం క్రిందనున్న వేడినీళ్ల గిన్నెలూ, పాలగిన్నే తీసుకొని కన్నీళ్లు తుడుచుకుంటూ దొడ్లోకి పోతూఉన్నది! ఎదురుగా వస్తూఉన్న రాజేశ్వరమ్మ కమలమ్మ కన్నులు తుడుచుకోడం చూచి "మాసామ్మ యేమి పాపపుసామ్మో తినేతిండ్లు తింటూనే ఉంటారు- అయ్యో కర్చులు అవుతూనే ఉంటాయి. వచ్చేరోగాలు వస్తూనే ఉంటాయి. మందులకూ మాకులకూ పోసేడబ్బు పోస్తూనే ఉంటాము. మళ్లీ యేమో బాధపడుతున్నట్లు కన్నీళ్లు కారుస్తూ ఉంటారు" అన్నది.

కమలమ్మ యేమీ జబాబుచెప్పకుండా ప్రక్కకు తప్పుకొని నెమ్మదిగా వెళ్లి పోయింది.

తిన్నగా రాజేశ్వరమ్మ మధుసూదను పడుకొన్న గదిలోకి వెళ్లి 'యేమయ్యా యెన్నాళ్లకూ మంచం వదలకుండా ఉన్నావు. ఎవరినన్నా చూస్తే నంగనాచిలాగా మాట్లాడవు. అమ్మను చూస్తే యెక్కడలేని ముచ్చట్లూ మొదలుపెట్టావే'అన్నది, రాజేశ్వరమ్మ గది దాటిపోయిందాకా మాట్లాడకుండా బల్లిలాగా మంచం కరచిపట్టుకొని పడుకొని ఆమెవెళ్లంగానే ఒక ఆపద తప్పి బయటపడ్డట్లు తెప్పిరిల్లాడు మధు. ఎప్పుడూ చురచురచూపులే చూస్తూ విరసపుమాటలే మాట్లాడటంచేత మేనమామభార్యనుచూస్తే మధుసూదనునకు అమిత భయం.

౨

శ్రీనివాసరావుపంతులు డిప్యూటీకలెక్టరు చేస్తూ నెలకు అరువందలరూపాయలు సంపాదిస్తూ ఉన్నాడు. కాని రాజేశ్వరమ్మవద్ద మాట్లాడే సత్తాలేదు ఆయనకు. అడ్డెడు తవ్వేడు యిచ్చి అమ్మ నీ ప్రసాద మన్నట్టుగా, ఆరునూర్లూ సంపాదించి అమ్మగారిదోసిట్లో పోసి నీచిత్తమన్నట్టుగా ఉంటాడు. శ్రీనివాసరావుపంతులు చాలా మంచివాడు. చాలా తెలివైనవాడు. ఉద్యోగంలో ఆయన చూపే చాకచక్యం చూస్తే ఆయనభార్యా విషయంలో యింత అసమర్థుడుగా ఉంటాడేమా అని ఆశ్చర్యం పొందుతారు. కాని, ఆయన తెలివితక్కువచేత మాత్రం యిట్లా ప్రవర్తించడం లేదని కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది. సంసారం గుట్టుగా వెళ్లాలంటే మొగుడికి పెళ్లామైనా లొంగిఉండాలె, పెళ్లానికి మొగుడైనా లొంగి ఉండాలె. ఇద్దరూ లొంగనివాళ్లైతే గుట్టుగా ఉండే సంసారం రట్టయి ఊరివారి ఉబుసుపోకకు హేతువవుతుంది. కాబట్టి రాజేశ్వరివిషయంలో మొదటిది అసంభవం కనుక రెండవది ఖాయమైంది.

శ్రీనివాసరావుపంతులుకు కమల ఒక్కతే తోబుట్టువు. అన్నదమ్ములుగూడా లేరు. కనుక చెల్లెలుమీద ఆయనకు చాలా ప్రేమ. అన్నగారంటే ఆమెకూ చాలా ప్రేమా, గౌరవంగూడా ఉన్నది. చాలాసొమ్ము కర్చుపెట్టి యింజనీయరుపరీక్షకు చదివి ఉద్యోగమైన రెండేండ్లకే హఠాత్తుగా చనిపోయినాడు కమలమ్మపెనిమిటి. చదువుకు చేసిన అప్పులైనా తీరకుండా, ఆలూమగల అనురాగపు ముచ్చటలైనా తీరకుండా, ముక్కుపచ్చలారని మూడేండ్లకూన మధువు ముద్దుమురిపాలైనా తీరకుండా, చిన్నకాపురం చితికి పోయింది. ఆమే, ఆమె చిన్నకొడుకూ సుఖంగా జీవించడానికి తగిన ఆధారమైనా లేదువాళ్లకు. ఆవల సంపాదించి అన్నీ అమర్చుకుందామనిఉన్నవన్నీ అమిత్ర చదువుకున్నాడతను. మరిఅమర్చుకోడానికిఅవకాశం లేకుండా దాటిపోయినాడు. ఏమనుకుంటే యేమున్నది? శ్రీనివాసరావుకు చెల్లెలుస్థితి దుర్భరవ్యథను గలిగించినది. కమలమ్మ కప్పటికి పందొమ్మి

దేండ్లు. ఎక్కడవున్నా ఒంటరిగా ఉంచేస్థితి గాదు. కనుక యింట్లో పరిస్థితులు దుర్భరమని తెలిసికూడా తెచ్చి యింట్లో పెట్టుకున్నాడు చెల్లెలిని. తనధాటీ కాగలేక రోజూ వంటవాళ్లు లేచిపోయి తానే వంటచేసుకోలేక పడుతున్న అవస్థ అంతా తొలిగిపోతుందిగదా అని రాజేశ్వరమ్మగూడా ఒకవిధంగా కమలమ్మను తీసుకురావడానికి సమాధానపడ్డది.

ప్రపంచంలో సమస్తసుఖాలకు తానే వారసు ననుకుంటుంది రాజేశ్వరమ్మ. ప్రపంచం సుఖదుఃఖద్వంద్వమని ఆమెకు తెలియదు. పూర్వజన్మలో పుణ్యం చేసుకోడంచేత తా నింత భాగ్యశాలినిగా పుట్టాననీ, కమలమ్మవంటివాళ్లు పాపంచేసుకోడం చేత పాపఫలం అనుభవిస్తున్నారనీ ఆమెఊహ. అందువల్లనే అటువంటి దుఃఖితులమీద తాను దయజూపవలసిన అగత్యం లేదని ఆమె తలంపు. కనుకనే ఆమె గర్వంతో 'చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా' అంటూ ఉంటుంది, కమలమ్మ క్రుళ్లిక్రుళ్లి యేడ్చేట్టుగా. అష్టమదాలలో అగ్రగణ్యమైందిగదా ధనమదం.

3

తెల్లవారుజామున నాల్గుగంటలైంది. కమలమ్మ లేచి పని పాటలు చేసుకుందామని అనుకుంటూఉండగా 'మధు' గూడా మేల్కొని 'అమ్మ కథ చెప్పవే' అన్నాడు.

'ఇప్పుడు కథేమిటివాన్నా! లేచి పాఠాలు చదువుకో' అన్నది, తల్లి.

'పాఠాలన్నీ రాత్రే చదువుకున్నాను. ఇక చదువుకోవలసినవి లేవు. ఒక మంచికథ చెప్పు.'

'నీకు కథలుచెబ్తూ కూర్చుంటే తెల్లవారదూ, పోయి పనులు చేసుకోవద్దా బాబూ.'

'చేసుకోవచ్చులే. ఇవ్వాళేమి భయమమ్మా! అత్తయ్య ఊళ్లో లేదుగా".'

'ఊళ్లో లేకపోతేమాత్రము. నన్ను కూర్చోమని వెళ్లిందా నాన్నా! అప్పడాలుట, వడియాలుట, కందిపప్పుట, పెసరపప్పుట' అన్నంలో పొడిట, ఎన్నో పురమాయించి పోయింది. ఈ వారంరోజుల్లో అవన్నీ కావద్దూ?"

'ఓయమ్మో! ఇన్ని చేయాలెనా? అమ్మా! నీ కీ పని చేసే కష్టం యెప్పుడు పోతుందీ?'

'బాబూ! నీవు పెరిగి పెద్దవాడవై చక్కగా చదువుకొని మామయ్యలాగా పెద్ద ఉద్యోగంచేసి డబ్బుసంపాదించితివా వాళ్లమ్మ కష్టంతొలగించిన గరుత్మంతుడిలాగా నన్ను గూడా యీ కష్టంలో నుంచి విముక్తిపొందిస్తావు.'

'గరుత్మంతు డెవరమ్మా?'

'పక్షులకు రాజు. వినతకొడుకు.'

"వాళ్లమ్మ యేమికష్టపడుతుంటే విడిపించాడు పక్షిరాజు.?"

"నావలెనే ఒకరియింట్లో యెప్పుడూ చాకిరీచేసి అవస్థపడుతుంటే విడిపించాడు."

"వాళ్లమ్మ యెవరియింట్లో పనిచేసేది?"

"తన సవతి అయిన కద్రువయింట్లో దాసీత్వం చేసేది."

"ఎందుకు చేసేది?"

"కద్రువా, వినతా ఒకమాటు ఒకసముద్రపుఒడ్డున ఒక గుఱ్ఱాన్ని చూచారు. ఆగుఱ్ఱం అంతా తెల్లగా ఉన్నదని వినతా, లేదు, తోక నల్లగా ఉన్నదని కద్రువా, ఇద్దఱూ వాదించు

కున్నారు. వాదించుకొని వాదించుకొని ఆఖరుకు యెవరిమాట నిజమైతే వాళ్లకు రెండోవాళ్లు దాసీగాఉండాలనిపందెంవేసుకొని మరునాడు ఆగుఱ్ఱానికి దగ్గిరగాబోయి చూద్దామని నిర్ణయం చేసుకొని యింటికి పోయినారు, మఱునాడు పోయిచూస్తే ఏమి మాయ చేసిందో కద్రువ ఆగుఱ్ఱంతోక నల్లగానే ఉన్నది. పాపం అందువల్ల వినత పందెంలో ఓడిపోయి కద్రువకు దాసీ దై పోయింది."

"అమ్మా! నీవు యేమిపందెంలో ఓడి అత్తయ్యదగ్గిర పని చేస్తున్నావే."

"అవును. నేనూ ఒక ఆటను విధితో ఆడి నాజోడాకాయను విధి బలవంతంగా చంపి ఓడించడంచేత నే దాసీనైపోయినాను. ఈజీవితంమాత్రం ఒక ఆటగాదూ. నాన్నా ఇక నేను వెళ్లుతా. నన్ను మాటలలో పెట్టకు, పనిఉన్నది."

"అమ్మా ఇంకా ఒక్కమాట. ఇది చెప్తే నిన్నిక అడగను."

"అబ్బా! ఏమి ప్రశ్నలతో విసిగిస్తావురా! కదలంటే యింత చెవికోసుకుంటావేమిరా."

"వాళ్లమ్మ కద్రువయింట్లో పనిచేస్తుంటే గరుత్మంతుడు ఆమెను ఎట్లా విడిపించాడు?"

"గరుత్మంతుడు చాలా మంచివాడు. చాలా తెలివైనవాడు. చాలా బలంగలవాడు. తల్లిఅంటే చాలా ప్రేమగలవాడు. దేవుడంటే చాలా భక్తిగలవాడు. వాళ్లమ్మ కద్రువకు దాసీదై వాళ్లింట్లో పనిచేస్తుండటంచేత ఈగరుత్మంతుణ్ణి గూడా పనిచేయమనే వాళ్లు. కద్రువ పిల్లలంతా పాములు. ఆపాములను యెత్తుకోమనే వాళ్లు గరుత్మంతుణ్ణి."

"అవును అత్తయ్య పాపను యెత్తుకోమని నన్ను కోప్పడటంలేదా?"

"గరుత్మంతుడికి ఈ ఊడిగం కష్టమనిపించింది. ఎట్లాగైనా యీకష్టం తనకూ, తనఅమ్మకూ లేకుండా తొలిగించుకోవాలనుకున్నాడు. 'మీకు యేమియిస్తే నన్నూ, మాఅమ్మనూ యీ పనిలోనుంచి విడుదల జేస్తా'రని పాములను అడిగాడు ఒకనాడు. అవిఅన్నీ ఆలోచించుకొని చెప్పినవిగదా, 'దేవలోకంలో దేవేంద్రపట్నంలో అమృతంఅనే చావులేని దివ్యౌషధం ఉన్నది. అది మాకు తెచ్చియిస్తివా అంటే మీకు దాస్యవిముక్తి చేస్తాము' అని. సరే నన్నాడు గరుత్మంతుడు. వాళ్లఅమ్మవద్దకువెళ్లి సంగతంతా చెప్పాడు. తరువాత వాళ్లనాన్నతో చెప్పాడు. ఇద్దరికీ నమస్కారంచేశాడు. వాళ్లు యిద్దరూ అమృతంతోగూడా నీవు సుఖంగా రావాలెనని దీవించి పంపించారు. పక్షిరాజు రివ్వున దేవతాలోకం పోయినాడు. అమృతంచుట్టూ కాపలిఉన్న దేవతలందరితో పోట్లాడి జయించి అమృతకలశం దెచ్చి పాములకిచ్చాడు. "దాస్యవిముక్తి అయిపోయింది. ఇక మాఅమ్మను నేను తీసుకపోతా"నని తల్లిని వీపుమీద యెక్కించుకొని చలోమని వెళ్లిపోయినాడు. విన్నావా యిది గరుత్మంతుడికథ."

"అమ్మా, బలేమంచికథ చెప్పావు. ఇంత మంచికథ నీ కెవరు చెప్పారే?"

"ఎవరుచెప్పాలె. భారతంలో లేదా చదువుకుంటే?"

"అమ్మా, భారతం చాలా పెద్దపుస్తకం. గాదూ, నీవు చదువగలవా?"

"అవును నీ కేమితెల్సు. నీకు బుద్ధి తెలిసినప్పటినుంచీ యిట్లా ఊడిగపుదానిలాగానే ఉంటిని. ఆరోజులన్నీ మీ నాన్నగారితోనే పోయినాయి. అదొక కల". కమలమ్మకు కన్నులు చెమ్మగిల్లినవి.

"అమ్మా! నాకుగూడా నాన్నగారున్నారా? మన రాము బావావాళ్లు మామయ్యను 'నాన్నా, నాన్నా' అని పిలుస్తుంటే నాకుగూడా నాన్నా అని పిలవా లనిపిస్తుంది. మా నాన్నగారుంటే నేనుగూడా పిలిచేవాడినిగా.........లేరుగా మానాన్న అన్నాడు మధు ఎంతోదైన్యంగా "

మధుమాటలవలన కమలమ్మకు వెనుకటి వృత్తాంత మంతా ఒక్కమాటు కప్పున జ్ఞాపకం వచ్చింది. అప్పటి వైభవం యిప్పటి హీనస్థితీ ప్రాణంపొయ్యే సమయంలో భర్త తనచేతిని గట్టిగా పట్టుకొని "కమలా మనజీవితం యెంతో వైభవంగా ఉంటుం దనుకున్నాను. మఱి చదువుకుచేసిన అప్పు సప్పులైనా చూచుకోకుండానే చాటిపోతున్నా. అప్పుల వాళ్లు కటికితనంగా వచ్చి ఉన్నది కాస్తా ఊడ్చుకుపోతే నీవూ నాచిన్నిమధూ ఎవరియింట ఊడిగం చేయాలో" అని అని అన్నమాటలో, అన్నీ స్మృతికి వచ్చి ఆమె మనస్సు దుఃఖసముద్రం అయిపోయింది. ప్రవాహవేగంచేత పొరలి వచ్చే సెలయేళ్లలాగా రెండుకండ్లనుండి జొటజొటా కన్నీళ్లు రావడం మొదలుపెట్టె, ఆశోకవేగం ఆపుకోలేక కమలమ్మ అక్కడినుంచీ చివాలున లేచిపోయింది.

తల్లి పల్కినపలుక్కులూ, ఆమెచెప్పిన కథా ఆమె పొందుతున్న దుఃఖమూ అన్నీ తనలో యేదో అవ్యక్తమైన ఆందోళననూ, కార్యపరత్వమునూ పురికొల్పుతూ ఉండగా యెనిమిదేండ్ల కుఱ్ఱవాడు మధుపక్కమీద అట్లాగే చాలసేపు పడుకొని యేదో యోచిస్తూ ఉండిపోయినాడు.

౪

తమకు పుష్టిగాఉంటే మనుష్యులకు సంతోషం తృప్తీలేదు. తమకున్నది యితరులకు లేకుండా ఉండాలె. తామొక్కరే అనుభవిస్తూ ఉండాలె. అదీ అల్పులగు మానవుల ఆసురేచ్ఛ. పసిబిడ్డల దగ్గిరనుంచీ పెద్దవాళ్లవఱకూ యీగుణం సాధారణంగానే ఉంటుంది. ఈఓర్వలేనితనం స్వల్పం అనుకుంటాముగాని దారుణమైంది. రాజేశ్వ

రమ్మ నెలకు యిరవై రూపాయలిచ్చి బిడ్డలకు ప్రైవేటు చెప్పిస్తున్నది. బడికి రానూపోనూ బండ్లు యేర్పాటుచేసి పిల్లలు భూమిమీద కాలు పెట్టకుండా వైభవం సాగిస్తూ ఉన్నది. పైగా డిప్యూటీకలెక్టరుగారి కొడుకులని ఉపాధ్యాయుల అభిమానపుచూపుగూడా రామకృష్ణుల మీదనే ఉన్నది. ఇన్ని ఉన్నా ప్రతిసడవా వారికి ప్రమోషన్ చేసేరన్న పేరేగాని ప్రజ్ఞగా ప్యాసయినారన్నమాట లేదు. తన కున్నదే యితరులకుంటేనే చూడజాలని మనుష్యులకు తనకు లేక యితరులకు మాత్రమే కలిగిందంటే యెంత బాధగా ఉంటుంది. నేడు మధు స్కూలుఫైనలు పరీక్షావార్త రాజేశ్వరమ్మ కట్టి దుఃఖాన్నే కలిగించింది.

రాజేశ్వరమ్మ మధు చదువువిషయమై యెంత ఉదాసీనంగా ఉండాలో అంత ఉదాసీనంగా ఉన్నది. తనకొడుకులకు మాతురుహా ప్రైవేటుచెప్పిస్తూ ఉన్నప్పుడు మధుమాట స్మరించి యెఱుగదు. తనకొమరులను బండిమీద బడికిపంపిస్తూ ఒక్కమాటు మధును దానిమీదయెక్కి పొమ్మనిచెప్పియెఱుగదు. జోరుగా వానలు కురుస్తూ, తీవ్రంగా యెండలుకాస్తున్నా మధు పాదచారి అయ్యే బడికి వెళ్లేవాడు. తాను స్వంతంగానే చదువుకొనేవాడు. వీడికి ఒక్కపాఠమైనా చెప్పే సహాయు లెవరూ లేరు, యేమి పరీక్షవుతాడని అనుకుంటూ ఉండేది రాజేశ్వరమ్మ. కాని మధు మొదటితరగతిలోనే కృతార్థుడౌతూ ఉండేవాడు. ఆవిధంగానే నేడు స్కూలు ఫైనలు పరీక్షలోగూడా ఉత్తముడుగా జయమందినట్లు తెలిసింది. రాజేశ్వరమ్మకొడుకులిద్దఱూ తప్పిపోయినారు. తనకొడుకులిద్దఱూ తప్పి యేడుస్తుంటే మధు పైక్లాసులో గూడా చదువనా. కనుకనే రాజేశ్వరమ్మ మధుమీద ఉన్న ఈర్ష్యను అనుగ్రహంగా మలిపి శ్రీనివాసరావుపంతులుతో మధువుకు ఇక చదువు చాలించి యే గుమాస్తానౌకరీలోనైనా ప్రవేశపెట్టండని చెప్పింది. భార్యసలహాకు చకితుడై శ్రీనివాసరావుపంతులు మధుకు ఇప్పుడు ఉద్యోగపుతొందరేమి వచ్చిందన్నాడు.

"పైకి చదువడానికి యెంతో డబ్బు కావాలె. ఎఫ్‌యే చదువు యిక్కడ లేకపోవడంచేత మధు పొరుగూరికి పోవాలె. వాళ్లు తల్లీబిడ్డా ఒకరి నొకరు విడిచిఉండలేరు. ఏదో నౌకరీఅయితే యిద్దఱూ ఒకచోటనే ఉంటారు. వాళ్ల పొట్ట వాళ్లు పోసుకుంటారు. యింకా పైకి చదివిమాత్రం యేమిచేయాలె?"

"మధుసూదనునకు యింకా పదిహేనేండ్లునిండలేదు. వాడిని యీసంవత్సరం పరీక్షకు పంపడానికి ప్రత్యేకం దీనిమీద పంపవలసి వచ్చింది. ఇటువంటిపసివాడిని యేఉద్యోగంలో ప్రవేశపెట్టను."

"పోనీ యీసంవత్సరం వెళ్లినతర్వాతనే చేస్తాడు, చదువు చాలించితే సరి."

"నవనవలాడుతూ పెరుగుతున్న మొక్కతలను త్రుంచివేసినట్లుగా యిప్పుడు చక్కగా చదువుకుంటున్న మధుచదువు ఆపవలసిన తొందరేమివచ్చింది. వాడు యీపసితనంలోనే ఉద్యోగం చేయాలిసిన పనేమి?"

"అయితే పొరుగూరిలో ఉంచితే తిండికి జీతానికి యెంత పెట్టితే అవుతుందో."

"మనమేమి పెట్టవలసి ఉండదు."

"మనం పెట్టకపోతే యెవరు పెట్టుతారు? మనం కాకపోతే వారికి వేరే దిక్కేమున్నది?"

"అందటికి దేవుడేదిక్కు."

"దేవుడు దిక్కైతే దేవుడు పోషిస్తున్నాడా, మనం పోషిస్తున్నాము గాని."

"మన మెవరు పోషించడానికి? మనలను పోషిస్తున్న వాడూ దేవుడే!"

"మీ వేదాంతవచనాల కేమి? ఊళ్లోవాళ్లు చదువుసంధ్యలకోసం సొమ్మంతా కర్చుపెట్టి బిడ్డలనోట మట్టి కొట్టుతున్నారు. ఏమైనాసరే మధును చదివించడానికివీలులేదు. ఏబస్తీలో ఉంచినా నెలకు నలభైరూపాయలకు తక్కువకావు. ఇంట్లో ఉండి చదువుకుంటూఉంటే సరిపోయిందికాని ఏపట్నవాసంలో కీవిగా ఉంచి చదివించడానికి నలభైలు యాభైలు పంపి బిడ్డలను అన్యాయం చేయనా? బిడ్డ లిద్దఱూ తప్పితే చీమా చింతా లేదు. పైగా యెక్కడో మేనల్లుణ్ణి చదువుకు పంపడానికి యీ బులపాటం ఏమిటో తెలియకుండా ఉన్నది. ఇదే అయినవాళ్లకు ఆకుల్లోనూ, కానివాళ్లకు కంచాల్లోను అంటారు."

"వాడు కానివాడా?"

"మీబిడ్డలకంటేనా?"

"నాబిడ్డలసంగతి నీవుచెప్పాలెనా?"

"మీబిడ్డలని మీకున్నదా. రెండేండ్లనుండి పెద్దవాడిపరీక్ష పోతూఉండే. ఈయేడు చిన్నవాడిదీ పోయే. ఆ సంగతి పట్టదాయె. పైగా బిడ్డలను అన్యాయంచేసి మేనల్లుణ్ణి చదివిస్తానని బులుపాయె. ఏమన్నా అంటే నేను వత్తిదాన్ని అవుతానుగాని మీఆలోచన ఎట్లాఉంది చెప్పండి?"

"మనసొమ్ముకర్చు లేకపోయినా మధును చదువుకోనివ్వవా?"

"ఆమాటంటేనే నాకు ఒళ్లు మండుతుంది. మూడేళ్లపిల్లవాడికి అబ్బపోతే నాటినుంచి నేటిదాకా మనసొమ్ము కర్చు అవుతున్నదా?"

"అవును. యిన్నాళ్లనుంచీ మనసొమ్ము కర్చైనమాట నిజమే ఇకనుంచీ మధు చదువుకు మనమేమీ కర్చుచేయనక్కరలేదు."

"చేయకుండా?... ఈగుట్టుమాట లేమిటి, ఉన్న సంగతేమిటో చెప్పరాదా?"

"మధు పరీక్షలో ఫస్టునప్యాసైనందుకు ఎఫ్.యే. చదువుకు జీతంలేకుండా చేసే బహుమానానికి అర్హుడైనాడు. చెన్నపట్నంలో మాపినతల్లికొడుకు పురుషోత్తమరావు హైకోర్టుప్లీడరుగా ఉన్నాడుగదా. వాళ్లయింట్లో ఉంటాడు మధు. మధు స్కూలు ఫైనలు ప్యాసుఅయితే నావద్దకు పంపమని యెన్నాళ్లనుంచో అడుగుతున్నాడు. వాడిభార్యాగూడా మాకు మేనమామ కూతురున్నూ, మాకమలమ్మకు ప్రియస్నేహితురాలున్నూ అవడంచేత మనను ప్రేమగా చూస్తుంది కనుక వాడిని చెన్నపట్నం పంపుతాను. ఇక నీకేమి కర్చున్నది చెప్పూ?"

మధు చదువును భంగపఱచాలనే తీవ్రోద్దేశంతో రాజేశ్వరమ్మ ప్రయోగించినబాణం పరాస్తమై వచ్చి మళ్లీ రాజేశ్వరమ్మ గుండెకే గ్రుచ్చుకొన్నది. పాపం యిక ఆవిడే యేమి చేస్తుంది? తన సొమ్ము వ్యయంచేయడమైతే వల్లగాదని అడ్డుపడగలదు గాని ఇప్పుడు శ్రీనివాసరావుపంతులు చెప్పిన సమాధానమునకు జవాబేమున్నది? ఓడిపోయినట్టుగా ముఖం చిన్నబుచ్చుకొన్నది రాజేశ్వరమ్మ. తాను అనుకున్నట్టుగానే శ్రీనివాసరావుపంతులు మధుకు కావలసినవన్నీ సమకూర్చి జూలైనెల రాగానే చెన్నపురి పంపించాడు.

౫

శ్రీనివాసరావుపంతులు మధ్యాహ్నం భోజనం కాగానే కాసేపు విశ్రమించి అప్పుడే లేచారు. ఇంతలో రాజేశ్వరమ్మ ప్రత్యక్షమై "యెప్పుడూ మీఉద్యోగపుగొడవే మీకైతే ఎట్లా" గని సాధింపు మొదలుపెట్టింది.

"ఏమికావాలె నీకు? బెంగుళూరుచీరెలకు ఆర్డరు యివ్వమంటావా? చబిల్‌దాస్‌కంపెనీకి నగలకు వ్రాయమంటావా? ఏమిటో నీ గొడవగూడా చెప్పు, ఆలోచిస్తా"నన్నాడుపంతులు మందహాసంచేస్తూ.

"ఇప్పుడు చీరెలమా సొమ్ములకేనా నేను కొట్టుకుంటున్నది. ఇంటిగొడవంటే బెంగుళూరుచీరెలూ, చెన్నపట్నపు సొమ్ములూ తెచ్చిపెట్టమని అర్థమా? మీరు యేమాట మాట్లాడినా యిట్లాగే ఉంటుంది. అదేమంటేఅసలే మాట్లాడకుండా మూగనోము పడ్తారు."

"ఊరికే సోది కట్టిపెట్టి సంగతేమిటో చెప్పు."

"అడిగో అట్లా అడిగితే యేదైనా మంచీచెడూ చెప్పకోవచ్చు."

"...నసరే అట్లాగే చెప్పు. యివ్వాళ ఆదివారం, కచ్చేరీపని లేదు. నీవు చెప్పేవన్నీ వింటాను ఇదేపనిగా సాయంత్రం వఱకూ."

"మీనాక్షికి పద్నాలుగేండ్లు గూడా వెళ్లిపోతున్నాయి. పెండ్లిమాట తలపెట్టకపోతిరి. మీరు స్వయంగా విచారించరాయెను. ఎవరికైనా కనుక్కోమని వ్రాయరాయెను. ఏమని మీ ఉద్దేశం పిల్లకు సంబంధము విచారించారా?"

"విచారించవలసిన పనేమున్నది?"

"విచారించకుండానే అల్లుడు వస్తాడా యేమి?"

"మీ రెంతగొప్పవారైనా ఈరోజుల్లో మాటలు కావవి."

"ఎక్కడనుంచి రావాలె, ఇంట్లోనే ఉంటే? ఇంట్లో ఉన్న వధూవరులకు యిబ్బంది యేమున్నది? మన కెప్పుడు చేయవలెనని బుద్ధి పుట్టితే అప్పుడే చేయవచ్చు."

"ఇదేమి చిత్రము. అల్లుడు యింట్లోనే ఉన్నాడా? ఎవరు?"

"మన మధు."

"అయ్యోయ్యకర్మమా! వంటముండ కొడుకు."

"ఛీ నోరుమూయ్".

"నన్ను నోరుమూయమంటారుగాని ఉండపోతే యిల్లులేదు పండబోతే మంచంలేదు. ఎక్కడా సెంటుభూమి లేదు. నిరాధారుడికి నాబిడ్డనివ్వమనడానికి మీకునోరెట్లావచ్చింది. ఇట్లాంటి మీకు యింకాయింకా ఆపేక్షఉంటే ఎంతైనా దోచిపెట్టుకోండి గాని ఆపుట్టుదరిద్రుడికి నాబిడ్డ నివ్వమనిమాత్రం సలహా చేయకండి." అని రాజేశ్వరమ్మ కళ్లనీళ్లు గొటజిమ్మటం ప్రారంభించింది.

"నీవేమీ దుఃఖపడవద్దు. మీనాక్షిని యియ్యకపోతే మధుకు పెళ్లికాకపోదు. కానినీవుమాత్రం ఆనిక పశ్చాత్తాప పడ్తావు. ఆలోచించుకో."

"అయ్యో! ఇంతచక్కని సంబంధం తప్పిపోతుందనా!"

"నీచెప్పేదిమా మూర్ఖురాలవే, ఒక్కగానొక్క ఆడబిడ్డ మనకు. అమ్మాయికొఱకే విచారిస్తున్నా, చక్కనివాడు, తెలివైనవాడు, బుద్ధిమంతుడూ మధు"

"ఏముంటేనేమి చిట్టెడు గింజలొచ్చే పొలం లేకపోయిన తర్వాత. మీచెల్లెలుగనక శక్తిలాగా పనిచేస్తున్నది. నాబిడ్డ సుకుమారి."

శ్రీనివాసరావుపంతులు అమిత సహనంగలవాడు కాని అతని ఓర్పునంతా కబళించే శక్తిగలది రాజేశ్వరమ్మ. రాజేశ్వరమ్మ ఆఖరుకు పలికినమాటలు ఆయనకు చాలా అసహ్యం గొల్పినవి. ఆయన ఏకాంతహృదయంలో అనేకవత్సరములుగా కల్పించుకుంటూ ఉన్న మీనాక్షీమధుసూదనుల కల్యాణగాథలు నిముసంలో విఫలమైపోయినాయి. బలవంతంమీద చేసినా యవి విపరీతపర్యవసానానికి హేతువులౌతాయని రూపించుకొని మీనాక్షికి యితరత్రా విచారించి పెండ్లిచేద్దామని నిశ్చయించుకున్నాడు.

౬

రాజేశ్వరమ్మ ఏదైనా ఒకవిషయం మనస్సులో పడ్డదంటే అది మనస్సులో యెంతగా నున్నదో అంతకు పదిరెట్లుగా నోటితో వాగుతూ ఉండాలిసిందే గాని మనస్సులో యిముడ్చుకొనే రకం గాదు. ఎప్పుడైతే పెనిమిటి మీనాక్షిని మధుకు యిచ్చి వివాహం చేయడం తన అభిప్రాయమని చెప్పాడో అప్పటినుంచీ ఆమెమనస్సులో తుఫాను పుట్టినట్లయి సణుగులు, సాధింపులు, సూటిమాటలు, కేకలు అన్నీ మొదలుపెట్టింది. ఇందువల్ల కమలమ్మకు సులభంగా విషయం తెలిసిపోయింది. తనవదినెగారికి యిష్టంలేని పనియేమీ సాగదనీ, సాగినా సుఖంలేదనీ కమలమ్మకు బాగా తెలుసు. అందువల్ల అన్నగారితో యీవిషయమై ప్రస్తావించవలెనని కమలమ్మ యెదురు చూస్తున్నది.

ఆనాటిసాయంత్రం యెవరియింట్లోనో పెళ్లి అని రాజేశ్వరమ్మ పేరంటానికీ, భోజనానికీ వెళ్లింది మీనాక్షిని తీసుకొని. శ్రీనివాసరావుపంతులుగారు అప్పుడే కచ్చేరీనుంచి యింటికివచ్చి కోటూ, తలగుడ్డా తీసి కాళ్లూ చేతులూ కడుక్కొని 'అమ్మాయీ కొంచెము మంచినీళ్లు తీసుకరా'అని కమలమ్మను పిలిచారు. కమలమ్మ వెంటనే మంచినీళ్లు తీసుకొనివచ్చి అన్నగారికిచ్చి పక్కగా నుంచున్నది.

"మీవదినె యెక్కడికి పోయింది" అన్నాడు పంతులు

"ఎవరో ప్లీడరుగారియింట్లో వాళ్ల అమ్మాయి పెండ్లిట. నిన్న పేరంటానికీ, భోజనానికీ పిలిచివెళ్లినారు. అక్కడికి వెళ్లింది."

"మధువద్దనుంచీ ఉత్తరం వచ్చింది తెలిసిందా?"

"అవును ప్రొద్దున గోపాలుచెప్పాడు. పరీక్షసంవత్సరమని మాఘ డిశెంబరుసెలవులకు రానన్నాడుట గాదా."

"అవును, అదే వ్రాశాడు."

"పోనీ వచ్చేమిచేయాల. సెలవులలో అక్కడఉంటే బాగా చదువుకుంటాడు."

"అవు"నని పంతులు షికారువెళ్లడానికి లేవబోతూ ఉంటే 'అన్నయ్యా!' అన్నది కమల ఏదో చెప్పవచ్చినట్టుగా.

"ఏమమ్మా" అన్నాడు. పంతులు అదరంగా ప్రేమగా.

"మీనాక్షి వివాహం యెప్పుడు చేస్తావు? పాపం వదినె చాలా విచారపడుతున్నదే. ఆమెవిచారమేమిటి, ఎవరికైనా కష్టమే గాదా? పెండ్లియీడు వచ్చిన బిడ్డను యేఅయ్యచేతిలోనైనా పెట్టకుండా అట్టిపెట్టుకోడం."

"మీవదినె విచారపడుతుంది గాని చెప్పినమాట వినదు. ఇప్పుడు ఆడపిల్లలకు ఉచితమైన సంబంధాలు దొరకడం యెంత కష్టంగా ఉన్నది. మధుకు యిస్తామంటే అంగీకరించరాదా? ఎంతచక్కగానైనా పెండ్లిచేయవచ్చునే."

"మధుపెండ్లి ఏమితొందర యిప్పుడు? త్రాడూ బొంగరం లేనివాడు మధు. వాడికి పిల్లనివ్వడమంటే కష్టంగాదా? ఏదైనా మీ హోదాకు తగిన సంబంధం చూచుకోవాలె. ఒకవేళ మామీద ఉన్న ప్రేమకొద్దీ మాస్థితి నీకు హీనంగా తోపకపోవచ్చు కాని యితరుల కట్లా అనిపిస్తుందా? మధు యింకా ఎఫ్‌యే పరీక్షకన్నా వెళ్లలేదు. ఈపరీక్ష ఈవత్సరం ప్యాసైనా వాడి చదువంతా పూర్తియై ఉద్యోగంలోకి వచ్చేటప్పటికి నాలుగుసంవత్సరాలు పట్టుతుంది గదా. ఎప్పుడో ఉన్నతస్థితికి వస్తాడని నిరాధారుడుగా ఉన్నవాడికి పిల్లనివ్వాలంటే యేతల్లికైనా కష్టమేగాదా?"

"ఏమి కష్టం? మీవదినెకు బుద్ధిలేదు. గాని పిల్లనిచ్చి పెండ్లి చేసినతర్వాత వాడిని నిరాధారంగా ఉంచుతానా? నీవుగూడా, మీ వదినెను బలపరుస్తున్నావే. మీనాక్షిని నీ కొమారుడికి చేసికోడం యిష్టంలేదా?"

"అన్నయ్యా! అట్లా అభిప్రాయపడతావన్నే భయంతోనే నే నీప్రస్తావన చేయడంలేదు. మనమీద నాకేవిధమైన అధికారంలేదు. నీవు పెంచినబిడ్డ, నీవు పోషించిన బిడ్డ, నీవు చదువుచెప్పించిన బిడ్డ, నీఅండ నుండబట్టే మధు యీమాత్రం విద్యాబుద్ధులు కలవాడైనాడు. ఉపకృతికి మాఋ మేము జన్మజన్మలకూ తీర్చుకోలేము. నీకొమార్తెను మధుకు చేయడమంటే అంతకంటె సంతోషకార్యమేమున్నది నాకు? ఇంకో ఇంకో ఆడపిల్లలైనా లేరు అనికూ చూదామంటే. ఈసంబంధం విడిపోతే మనయిద్దరికీ శాశ్వతంగా విడుబాటు కలిగినట్లే. కాని వదినెకు అసంతృప్తియైన పని చేయడం కష్టం. అదే నాకు సందేహము. ఆమె మనస్ఫూర్తిగా ఒప్పుకుంటే నీకడ్డేమి ఉన్నదన్నయ్యా! నీసంబంధంకంటే యెక్కువైన సంబంధం ఉన్నదా నాకు? మీనాక్షి అయినా ఒకరంటి బిడ్డగాదు. చాలా మంచిపిల్ల. అది నాకు కోడలుగావటం మహాభాగ్యమే. వీలుగావుంటే నేను కాదనను. నాకూ మనసులో ఆశ లేకపోలేదు. కాని యేమి చేస్తాము?"

శ్రీనివాసరావుపంతులు యిక నేమీ మాట్లాడలేదు. నెమ్మదిగా లేచి క్లబ్బుకు వెళ్లిపోయినాడు. కమలమ్మ గూడా తనపనికి తాను వెళ్లిపోయింది.

౭

సుభద్రమ్మ ఒకపిల్లజమీభాగానికి వారసురాలు. చిన్ననాడే పెనిమిటి పోవడంచేత తనవంతుభాగం దాయాదులు కాజేసుకుపోతారని ఒకకుఱ్ఱవాడిని దత్తుచేసుకొని జమీలో భాగానికి హక్కు నిలబెట్టుకొన్నది. ఆపిల్లవాడిప్పుడు పద్దెనిమిదేండ్లవాడై మైనరుతీరిం

దనేమాట యెప్పుడువస్తుందా అని యెదురుతెన్నులు చూస్తు చూస్తున్నాడు. ఏకారణంచేతనో సుభద్రమ్మ కుఱ్ఱవాడికింకా పెండ్లి చేయలేదు. ఈసంబంధంయెవరో రాజేశ్వరమ్మచెవిని వేశారు. రాజేశ్వరమ్మకు పట్టరానిసంతోషం వచ్చింది. ఆసంబంధం యెట్లాగైనా పోనీయరాదనీ, యెన్నివేలు కట్నమడిగినా యివ్వాలసిందేననీ రాజేశ్వరమ్మ పట్టుపట్టింది. శ్రీనివాసరావుపంతులుకూడా సమ్మతించాడు. అయిదువేలు కట్నమిచ్చేటట్టూ పైగా లాంఛనాలు వగైరాలు జరిపేటట్టూ నిశ్చయం చేసుకున్నారు. పెండ్లిపనులు జోరుగా చేశారు. కొమార్తెకు జమీందారీసంబంధం వచ్చిందని రాజేశ్వరమ్మ మురిసిపోతున్నది. లోకమంతా అట్లాగే అనుకున్నారు. పెండ్లి ఆరంభమైంది. దాంతో మాటివిరవులూ, ముక్కువిరవులూ గూడా ఆరంభమైనాయి. రాజ్యాలు పోయినా రాజాంగాలు పోకకాబోలు పెండ్లివారు అన్నిమేళాలతోబాటు బోగంమేళాలుగూడా పెట్టారు. అయిదువేలు రొక్కమిచ్చి, అదనంగా లాంఛనాలుజరిపికూడా రాజేశ్వరమ్మ, శ్రీనివాసరావుపంతులూ జమీందారీ శకలుపోయే వియ్యాలవారిని సంతృప్తిపఱచలేకపోయినారు. గుడు గుడు గుంజం అన్నట్టు చిన్నచిన్న సంసారాలు గడుపుకొనేవాళ్లు జమీందార్లతో యేమి సాటిరాగలరని వియ్యపురాలు రెండు విదిలింపులు విదిలించేటప్పటికి రాజేశ్వరమ్మ హడలిపోయి గుక్కనీరుగుడ్లగుక్కుకొని ఇంటికి చేరింది. పెండ్లికొడుకు చూడబోతే వట్టిపోకేలా! ఊరిలో ఉద్యోగస్థులందఱినీ ఆహ్వానించి శ్రీనివాసరావుపంతులుగారు పెండ్లిలో ఒకనాడు పాటకచ్చేరీ జరిపిస్తూఉంటే అక్కడే ఒక సిగరెట్టు ముట్టించాడు పెండ్లికొడుకు. అంతటితో శ్రీనివాసరావుగారిమనస్సు క్రుంగిపోయింది. చూచిన పెద్దమనుష్యులంతా తెల్లపోయినారు. పదివేలరూపాయలు నష్టం. పైగా పనికిమాలిన అల్లుడనిపించింది అందఱికీ.

౮

అతివేగంగా ఉఱుకులుపెట్టుకుంటూ ప్రవహించే వర్షాకాలపు నదివలె సాగిపోయింది మధువిద్యాభ్యాసం. ఓడుఅనేది యెఱుగడు సరే సామాన్యంగా కృతార్థుడు కావటం అనేది గూడా మధు విద్యార్థిజీవితంలో అపరిచితమైన మాట. ప్రతియూనివర్సిటీ పరీక్షలోనూ ప్రథముడుగా అయి బహూకృతు లందాడు ... మంచి తెలివీ, తెలివికిదగిన చదువూ, చదువుకుదగిన యోగ్యతా, అన్నీ పువ్వులో వన్నె, వాసనా, మకరందం కూడినట్టు కూడినవి మధులో. ఇన్నీ ఉన్నట్టుగానే చక్కని రూపంగూడా మధుకు అమరి ఉన్నది. ఇట్టివయోరూప విద్యాగుణవిశేషాలచే ఒప్పిఉన్న మధుకు పిల్లనివ్వడానికి యేతల్లిదండ్రులు ముచ్చటపడరు? సంబంధాలు కొల్లగా వస్తున్నాయి. కాని పెండ్లిమీద మనసులేదు మధుకు.

మధు ఎం. ఏ. పరీక్షలో ఉత్తముడుగా కృతార్థుడైనాడనే మాట తెలియగానే తల్లీ, మేనమామా ఆనందసాగరంలో ఓలలాడిపోయినారు. ఇటువంటి కుమారరత్నమును కనడంచేత కమలమ్మ కడుపు రత్నగర్భ అయింది. ధన్యురాలు కమలమ్మ. కొమారునివల్ల యేఫలితం పొందాలని నిరీక్షిస్తూఉన్నదో ఆఫలితం లభింపజేసుకున్నది. సుమారు పద్దెనిమిదివత్సరాలనుంచీ ఆమెను నిబద్ధించి ఉంచిన దాస్యశృంఖలాలు నేటికి సడ్లువదలినాయి. ఆమె పరాధీనతాంధకారమును భేదించుకొని స్వాతంత్ర్యకిరణాలు ఆమెమీద ప్రసరించడం మొదలుపెట్టినాయి. ప్రొఫెసరుపని యిస్తామురమ్మని ఆంధ్రాయూనివర్సిటీనుంచి మధుసూదనుకు ఆర్డరు వచ్చింది. నింగికి పొంగుతూఉన్న ఆనందంతో మధు తన ఉద్యోగవర్తమానం మేనమామకూ తల్లికీ వినిపించాడు. 'మధూ! నా చిరవాంఛితం సఫలం చేశావు ధన్యుణ్ణైనా'నని మేనమామంటే 'నాకష్టం గట్టెక్కించావురా బాబూ!' అని తల్లి అభినందించింది. ఆనాడే మధు విశాఖపట్నం వెళ్లి సంగతులు తెలిసికొని నాకిక్కడ ౧౨౫ రూపాయల ఉద్యోగమైనదనీ వచ్చేనెలలో అమ్మను తీసుకపోతాననీ మేనమామకు జాబు వ్రాశాడు.

౯

మీనాక్షివిషయం రాజేశ్వరమ్మకు హృదయశల్యమైపోయింది. ఈవిషయంలో భర్తను సాధించడానికి లేదు. విధినిమారడానికి లేదు. ఆడబిడ్డను దెప్పటానికి లేదు. ఇది కేవలం స్వయంకృతాపరాధము. అత్తగయ్యాళిది, మొగుడు దుర్మార్గుడు. ఈ యిద్దఱిమధ్య అడక లోని పోకవలె మీనాక్షి నలిగిపోతున్నది. మీనాక్షి యీ కష్టా భరింపలేక యెప్పుడు యేమైపోతుందో అని రాజేశ్వరమ్మకు సులో ఒకభయం పడిపోయింది. ఈదిగులుచేత, ఈభీతిచేత పోయిన రాజేశ్వరమ్మలో మునుపటిరాగతనం చూస్తామన్నా కన కుండా పోయింది.

మధు విశాఖపట్నంనుంచి వచ్చాడు. అతనికి తల్లితోబాటు మేనమామనూ, మేనత్తనూ, వారిబిడ్డలనూ అందఱినీ తన ఉద్యోగపు ఊరికి తీసుకపోదామని సరదా. ముందుగా మేనమామను పిలిచాడు. 'నాకేమిటి మధూ ఎప్పుడుపడితే అప్పుడు వస్తా. నీవు పిలవాలెనా. మీఅత్తయ్యను ప్రయాణంచేయి' అన్నాడు. మేనత్తనుచూస్తే చిన్నప్పటినుంచీ మధుకు వల్లమాలినభయం. ఇప్పుడు పెద్దవాడు కావడంచేత మునుపటిలాగా చీదరించి చీవాట్లు పెట్టుతుందనే భయం లేకపోయినా ఏ నూటిపోటీమాటలతోనో మనస్సునొవ్వచేస్తుందని జొటు లేకపోలేదు. అయినా సాహసించి మేనత్తవద్దకు పోయి 'అత్తయ్యా! నీవూ మామయ్యా బావలూ అందఱూ విశాఖపట్నం రావాలె. ఇదంతా మీఆశీర్వచన ఫలితం' అన్నాడు వినయంగా. 'నాఆశీర్వచన మేమున్నది నాయనా! అన్నీ చేసేవాడు భగవంతుడు. ఆభగవంతుడే నీబుద్ధికుశలతకు మెచ్చి నిన్ను విద్యావంతుణ్ణిగా చేశాడు. బాగుపడావు.'

"అవును ఆబాగు మీవల్లనే జరిపించాడు గనుక భగవంతుడు మీరువస్తే నాకు సంతోషంగా ఉంటుంది."

"రావడానికి అభ్యంతర మేమున్నది వస్తాను కాని మీనాక్షి మూలంగా నాసంతోషం అంతా చచ్చిపోయింది. అది అక్కడా, నే నిక్కడా అల్లాడుతున్నాము. ఏనాటికేమో. చేజేతులాచేసి అనుభవిస్తున్నాను. నీచేతిలో బెట్టినట్లయితే నాకీచింత లేకపోవునుగా? కాని మీమామయ్యగారి మాట విన్నాను కాను. విధిబలం ఏమి చేయను? నాబిడ్డవ్రాత యిట్లా ఉంటే" అని రాజేశ్వరమ్మ కన్నీళ్లు జొటజొట విడిచింది. ఆమె కన్నీళ్లు చూచేటప్పటికి మధుసూదనుకు గూడా దుఃఖ మాగలేదు. కన్నీళ్లు ఉత్తరీయపు కొంగుతో రెండు మూడుమారులు గట్టిగా అద్దుకున్నాడు. పులివంటి రాజేశ్వరమ్మను గూడా కడుపుతీపి యేవిధంగా క్రుంగదీసిందో చూస్తే మధుకు ఆశ్చర్యమైపోయింది. ఆమె యింత దీనంగా మాట్లాడటం అతను యెన్నడూ చూడలేదు. ఈవిచారాతిశయంవల్ల రాజేశ్వరమ్మవద్ద విశాఖపట్నంవచ్చేమాట తేలలేదు. మళ్లీ మేనమామను అడిగితే "ఇద్దరమూ డిశంబరు సెలవులలో వస్తాము. ఇప్పుడు చిన్నబావనూ, మీ అమ్మనూ తీసుకపో. మేము రాలేదని అనుకోకు. నే నిప్పుడు వస్తే సెలవుపెట్టి రావాలె. కనుక చెప్పుతున్నాను. డిశంబరు సెలవులలోతప్పకుండావస్తా"నని నచ్చచెప్పాడు మేనమామ. కావాలసిన సామగ్రి తీసుకపొమ్మని రాజేశ్వరమ్మ చెప్పింది. కాని? 'యెందు కత్తయ్యా ఇక్కడినుంచీ రైలుఖర్చులుపెట్టి తీసుకొనిపోవడం అక్కడ అన్నీ దొరుకుతా' యన్నాడు మధు.

కమలమ్మ "వదినే! వెళ్లుతున్నా"నని చెప్పితే "నావల్ల నేరాలుంటే మఱచిపొ"మ్మన్నది రాజేశ్వరమ్మ. ఆమాటతో యిద్దఱి మనస్సులూ ద్రవీభూతమై కన్నులు చెమ్మగిల్ల చేసినాయి. సంతోషంచేత వెళ్లుతున్నా యెడబాటు ఒకవిచారకారణమే అని ఖిన్నులై అనుకున్నారు శ్రీనివాసరావుపంతులుగారు.

౧౦

మృదువైనస్థలంలో నాటిన మొక్కవలెనే నిర్మలమైన లేతహృదయంలో నాటిన మాటగూడా బాగా నాటుకుపోతుంది. పన్నెండు సంవత్సరాలైంది. కమలమ్మ మధుసూదనుకు గరుత్మంతుడి కథచెప్పి. కమలమ్మ ఈకథను ఆనాడే మఱచిపోయింది. కాని మధుకుమాత్రం "ఉల్లంబున మఱపు బుట్ట దొకనాడైనన్" అన్నట్టు మనస్సులో నిలిచిపోయి వయస్సుతో బాటు విద్యతోబాటు, బుద్ధితోబాటు వృద్ధిపొందుతూ వచ్చింది. తోడిపిల్లలంతా బడి విడువంగానేగానీ, స్కూలు లేనప్పుడుగానీ స్వేచ్ఛగా ఆడుకుంటూ "మధుసూదనరావు రావోయి ఆడుకుందా"మనే వాళ్లు, మధు పోవడానికి మొగ్గేవాడు కాడు. వాళ్లకేమి 'వాళ్లు యిష్టమువచ్చినట్టు ఆడుకుంటారు. నావలె అమ్మను పనిలోనుంచి విడిపించవలసిన పనేమున్నది వాళ్లకు?' అనుకొని మధు నేను రా ననేవాడు. సినీమాలనీ సర్కసులనీ ఏవో వినోదసందర్శనాలకు విద్యార్థులు తండోపతండములుగా వెళ్లుతూఉంటే మాతృదాస్యవిమోచనకు దీక్షపూని ఉన్న మధు ఆవినోదప్రస్తావనే లేకుండా ఇంటికివస్తూఉండే వాడు యేదో కార్యభారం నెత్తిమీద ఉన్నవాడివలె. ఎన్నో పెండ్లి సంబంధాలు వస్తూఉండేవి మధుకు. అతనిదగ్గిరకే వచ్చేవాళ్లు కొందఱు. శ్రీనివాసరావుపంతులుగారివద్దనుండి వచ్చేవి కొన్ని, పురుషోత్తమరావుపంతులుద్వారా చేరేవి కొన్ని. అన్నిటికీ మధుసూదను జబాబు ఒకటే, 'ఇప్పుడుగాదు' అని. అంటే 'అమ్మ పరాధీనత బాపినతర్వాత' అని అతనిభావము. ఈవిధంగా మధు తనకర్తవ్య పాలనకొఱకుగా అన్నిటినీ కట్టిపెట్టి యేకదీక్షతో ప్రవర్తించాడు ఇన్నాళ్లనుంచీ.

నేడు మధుసంతోషానికి మేర లేదు. పన్నెండువత్సరముల నుంచీ అతనిమనస్సు తహతహలాడుతూ దేనికొఱకు కృషిచేస్తున్నదో ఆఫలితాన్ని పొందాడు నేడు. తనయింట్లో తనకొమారునకు తన చేతిమీదగా అన్నము వండిపెట్టి కమలమ్మగూడా ధన్యురాలైంది.

రాత్రివేళ వెన్నెల పిండిఆరబోసినట్లున్నది. కమలమ్మ బయట ఆవెన్నెల్లో చల్లగాలికి మంచం వేసుకొని పడుకొన్నది. చల్లనిగాలి యింపుగా వీస్తూ ఉన్నది. సమీపంలో ఉన్న జాజిపందిరి విరబూచిన పుష్పాలతో విదుల్తూ నీలాకాశమునకూ తనకూ భేదం లేదు అని అంటూ పైగా సువాసనలో నేనే యెక్కువని అధిక్షేపిస్తున్నది.

ఆప్రశాంతసమయంలో కమలమ్మ యేదో యోచించుకుంటూ ఆకాశంవంక చూస్తూ ఉన్నది. నెమ్మదిగా మధు పసిబాలుడులాగా వచ్చి తల్లి పక్కలో కూర్చుండి 'అమ్మా ఒకకథ చెప్పవూ' అన్నాడు. కమలమ్మ పకక్కున నవ్వింది, 'చిన్ననాటి పిచ్చియింకా పోలేదా' అంటూ.

"పోలేదు. నేను యెనిమిదేండ్ల పిల్లవాడినిగా ఉన్నప్పుడు అత్తయ్య ఊళ్లో లేనినాడు గరుత్మంతుడికథ చెప్పావు."

"ఆకథ యింకా నీకు జ్ఞాపకం ఉన్నదా?"

"ఆకథేగాదు, ఆనాడు నీవు యింకాచెప్పిన మాటలు గూడా మనస్సులో అచ్చుగుద్దినట్లున్నాయి."

"ఏమిమాట చెప్పాను."

"నీవుగూడా గరుత్మంతుడివై దాస్యవిముక్తిచేయలన్నావు."

"అవును, అన్నానుకాబోలు."

"నే నిప్పుడు గరుత్మంతుణ్నైనానా?"

"అయినావు నాయనా, అయినావు. కాకపోతే నా కీస్వేచ్ఛ ఎక్కడినుంచి వచ్చింది?" అన్నది కమలమ్మ ఆనందోత్ఫుల్ల నేత్రా

లతో ప్రేమపురస్సరంగా మధు నెన్ను నిమురుతూ. మధు ధన్యోస్మి అనుకున్నాడో యేమో తనలో క్షణమాత్ర నిమీలితలోచను డైనాడు.

కమలమ్మ ఇంతలో 'నాన్నా!' అన్నది. 'ఏమమ్మా!' అన్నాడు మధు వినయంతో 'బాబూ, ఈవైభవమంతా నేను చూచి సంతోషింప దగ్గది. మరి నీవూ, నీభార్యా అనుభవింపతగ్గది...... నీ విట్లా బ్రహ్మచారిగా ఉండడం నాకు...........'

'దీనికేమి భాగ్యమమ్మా! మన పురుషోత్తమరావు మామయ్య కూతురు సిద్ధంగా ఉంటే.'

"తథాస్తు" అన్నది మాతృవాణి సంతృప్త హృదయంతో.

బుద్ధుడు నేడు జీవించియున్నయెడల



(ఇప్పటి మానసిక జీవనమును విమర్శించుటకే కాని బుద్ధభగవానుని దూషించుటకుకాదు)